ర్టులో ఉన్నవే ఇవన్నీను'' అంటూ రిపోర్టు తయారుచేసి, నాచేత రకరకాల పేపర్ల మీద సంతకాలు పెట్టించుకొని, ''వీళ్ళే సార్ దొంగలు. చోరీ జరిగిన పదిహేను రోజుల లోపలే నేరస్థుల్ని పట్టుకున్నందుకు, నాపై అధికారులు నన్ను ఎంతో మెచ్చుకున్నారు సార్, రండి మిమ్మల్ని యింటివద్ద దింపుతాను. ఒకసారి ఆంటీని కూడా కలిసినట్టుంటుంది.'' అన్నాడు.

నాకు ఇదంతా చాలా అయోమయంగా ఉంది.

ఈలోగా ఏదో అర్జంటు ఫోన్ రావడంతో-

''సార్ నేను మిమ్మల్ని తరువాత కలుస్తాను. మీరు వెళ్ళండి'' అని టేబుల్ మీద పరిచిన వస్తువుల్ని ఒక బేగ్‌లో పెట్టి నాకు అందించాడు.

నేను యింటికి చేరుకొనేసరికి నా భార్య బెడ్‌రూం పరుపుమీద ఆవిడ ఆభరణాలు, వెండి సామాను చూసుకుంటోంది. నేను ఈ ఆభరణాలు పోయాయనే పోలీసు రిపోర్టు యిచ్చింది.

ఒక్కసారిగా నాకు మతిపోయినట్టయింది. విజయవాడ పెళ్ళికి వెళ్ళే ముందురోజు అనుకోకుండా వాళ్ళ చెల్లెలు వస్తే ఆమెకి ఆభరణాలు అవీ ఇచ్చి వాళ్ళింట్లో భద్రపరచమని యిచ్చిందిట. ఇప్పుడు వాటిని తార్నాకా వెళ్ళి తెచ్చుకుంది. ఈ సంగతి నాకు తెలియదు.

మరి ప్రసాద్ రికవరీ చేసిచ్చిన ఈ వస్తువులు ఎవరివి? తేలుకుట్టిన దొంగలాగా మారుమాట్లాడకుండా అవి నేనే ఉంచేసుకోవాలా? కాదని వాపస్ చేసెయ్యాలా?

నాకన్నా నా భార్యే చాలా తెలివైంది ఆవిణ్ణే అడగాలి. ఏం చేద్దామంటుందో?!

ఇంతకీ నా ఇంటికి దొంగతనానికి వచ్చిన దొంగలకి నా యింటిలో ఏవీ దొరకలేదు. నావి మటుకు ఏవీ పోకపోయినా ఎవరి సొత్తో నాకు చే..ది.

అదే విచిత్రం. భళారే విచిత్రం.

**-ముసునూరి కాశీ విశ్వనాథశాస్త్రి**
**(హైదరాబాద్)**

# కాలమహిమ



**"నీ పేరు చెప్పమ్మా" కళ్ళజోడు సరిచేసుకొంటూ అడిగింది అబ్బాయి తల్లి హుందాగా!**

**"శారద" తలవంచుకొని సమాధానం చెప్పింది శారద.**

అమ్మాయికి ''వంటా వార్పూ వచ్చా?'' పెళ్ళికొడుకు వదినగారి ప్రశ్న.

''వచ్చు'' సిగ్గుపడుతూ తల వూపింది శారద.

''వంట ఒక్కటే కాదు కుట్లు, అల్లికలు చక్కగా పాడటం అన్నీ వచ్చు వదిన గారూ'' అంటూ వరస కలిపి చెప్పింది శారద తల్లి.

''మీకు పాటలు పాడటం వచ్చా?'' హుషారుగా అడిగింది ఆడపడుచు హోదాలో అబ్బాయి అక్క.

మౌనంగా తలాడించింది శారద.

''ఏది ఒక మంచి కీర్తన పాడమ్మా'' పెళ్ళికొడుకు తండ్రి కలగచేసుకుంటూ అడిగాడు.

అందరూ చుట్టూ కుర్చీల మీద కూర్చుని ఉన్నారు. శారద మధ్యలో చాపమీద కూర్చొని చేతిలో వీణతో చక్కగా అన్నమాచార్య కీర్తన ఆలపించింది.

పాట అయిపోగానే అందరూ ''చాలా బాగా పాడావమ్మా'' అంటూ ఆనందంగా మెచ్చుకున్నారు శారదని.

''అమ్మాయి సాక్షాత్ లక్ష్మీదేవిలా ఉంది. ఒక మంచిరోజు మా అబ్బాయి కూడా వచ్చి చూసిన తరువాత తాంబూలాలు మార్చుకుందాం'' అంటూ నవ్వుతూ చెప్పింది పెళ్ళికొడుకు తల్లి.

''ఇంతకీ అమ్మాయికి అమ్మ, నాన్నలకు ఉత్తరం రాసేపాటి అక్షరజ్ఞానం అన్నా ఉందా?'' అని ఆరాగా అడిగింది పెళ్ళి కొడుకు తల్లి.

''మెట్రిక్యులేషన్ పాసయ్యింది వదినగారు'' చెప్పింది శారద తల్లి. అంతే అప్పటిదాకా ఆనందంగా ఉన్న వారి ముఖాలు వెంటనే వెలవెలపోయాయి. ప్రక్కనే ఉన్న మధ్యవర్తితో ''ఏమయ్యా మాకు ఈ విషయం ముందే ఎందుకు చెప్పలేదు? ఏదో చాకలి పద్దులు రాసుకునే పిల్ల మాకు చాలు అంతే కానీ మెట్రిక్‌లు, పి.యు.సిలు చదివిన పిల్ల మావాడికి అక్కర్లేదు'' అంటూ ఠక్కున లేచి విస విసా బయటికి నడిచారు.

★ ★ ★

''ఐయామ్ హరి''

''ఐయామ్ దేవి'' ఒకళ్ళనొకళ్ళు పరిచయం చేసుకున్నారు.

''మీ హాబీస్ ఏమిటి?'' ప్రశ్నించాడు హరి.

''పెయింటింగ్, బుక్ రీడింగ్, మ్యూజిక్ వినటం, పాడటం'' సిగ్గుపడకుండా సమాధానం చెప్పింది దేవి.

పెద్దలందరూ హాల్లో ఒకవైపు కూర్చొని మాట్లాడుకొంటుంటే వీరిద్దరూ మరోవైపు సోఫాలో ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకొంటున్నారు. శారదమ్మ వచ్చిన పెళ్ళివారికి అన్ని మర్యాదలు చేస్తూనే మధ్య మధ్య కూతురు హరితో ఎలా మాట్లాడుతోందో అని ఒక కంట కనిపెడుతూనే ఉంది.

''మీ క్వాలిఫికేషన్ ఏమిటి?'' అడిగాడు హరి.

''ఎమ్మెస్సీ ఫిజిక్స్'' చెప్పింది దేవి.

''స్టేట్స్‌లో నాతోపాటు ఈక్వల్‌గా జాబ్ చేయాలి అంటే ఇంజనీరింగ్ అయినా కావాలి లేదా కంప్యూటర్ డిప్లొమా అయినా ఉండాలి. ఇప్పుడు నేర్చుకొంటాను అని చెప్పవద్దు. ఎందుకంటే నాకు అంత టైం లేదు'' అంటూ లేచి నిలబడ్డాడు హరి.

''ఏంటి బాబూ?'' అడిగింది శారద.

''సారీ ఆంటీ మీ అమ్మాయి క్వాలిఫికేషన్ నాకు సరిపోలేదు ఓ.కె. బై'' అంటూ బయటికి దారితీశాడు. మిగతావారు అతన్ని అనుసరించారు. ఆనాటి తన 'పెళ్ళిచూపుల' తంతు గుర్తుకు వచ్చి 'కాలమహిమ' అని నిట్టూర్చింది శారదమ్మ.

**-అడపా పద్మ (జగ్గయ్యపేట)**